క్లుప్తంగా

యడవల్లిలో 29 నుంచి ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవం

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం మధ్యాహ్నం ధ్వజ ప్రతిష్ఠ, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జూన్ 1న తిరుమలనాథస్వామి మూడో వార్షికోత్సవం

మార్కాపురం టౌన్: పెద్దదోర్నాల మండలం యడవల్లి గ్రామ సమీపంలో ఉన్న తిరుమల దేవుని కొండపై వెలసిన బాల తిరుమలనాథ స్వామి ఆలయ తృతీయ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు మందిర ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ మెంబర్ వెలుదండ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి కల్యాణం, అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ సరుకులు డీలర్ల వద్దే పంపిణీ

అర్ధవీడు: రేషన్ కార్డుదారులకు జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులు రేషను డీలర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వాహనాలను ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల పరిధిలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో రేషను డీలర్ ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నుట్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేస్తారని స్పష్టం చేశారు.

గ్రామ సచివాలయాలు తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

కొమరోలు: మండలంలోని నల్లగుంట్ల, దద్దవాడ గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ మస్తాన్‌వలి మంగళవారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారంపై సిబ్బందితో చర్చించి సూచనలిచ్చారు. యోగాంధ్ర సర్వే పురోగతిపై ఆరా తీసి సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు

బేస్తవారిపేట: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే రోజూ యోగా, ధ్యానం చేయడం ద్వారా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. నీతి కథలు చదివించడంతోపాటు డ్రాయింగ్, చదరంగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

పవనసుతునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో హనుమంతుడు

మార్కాపురం: మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం స్వామివారికి సుప్రభాతం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళ హారతి, పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డితోపాటు పలువురు గ్రామ కమిటీ ప్రతినిధులైన ఆడిటర్ గొలమారు నారాయణరెడ్డి, రంగారెడ్డి, నూనె శ్రీనివాసరెడ్డి, హనుమంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోత..

వినియోగదారులు కుతకుత!

- విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం
- చిన్నపాటి వర్షం కురిసినా గంటల తరబడి కరెంట్ కట్
- అర్ధరాత్రి వేళ ఉక్కపోత, దోమల బెడదతో జనం విలవిల
- కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి


అంధకారంలో గలిజేరుగుళ్ల బస్టాండ్

బేస్తవారిపేట: ఎడాపెడా విద్యుత్ సరఫరాకు కోత విధిస్తుండటం, ఈదురుగాలల ప్రభావంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వేళాపాల లేకుండా కోతలు విధిస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో జనం ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. గత కొద్ది రోజులుగా ద్రోణి ప్రభావంతో కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు సైతం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతుండటం విమర్శలకు తావిస్తోంది. వేసవి కాలం కావడంతో ఒకవైపు ఉక్కపోత మరోవైపు దోమల బెడద అధికంగా ఉంది. విద్యుత్ ఏ సమయంలో ఉంటుందో, ఉండదో తెలియడం లేదని, అర్ధరాత్రి వేళ విద్యుత్ సిబ్బంది నుంచి సరైన స్పందన కూడా ఉండటం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

వర్షం కురిసిందంటే కోతే..

చిన్నపాటి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసినా, సాధారణ వర్షం పడినా గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ శాఖ అధికారులు, సబ్‌స్టేషన్ల సిబ్బందికి ఫోన్ చేస్తే గాలివానకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయని, మరమ్మతుల పనులు చేస్తున్నామంటూ ఏదో ఒక కారణం చెబుతున్నారని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. బేస్తవారిపేట మండలంలోని జెన్నివారిపల్లెలో పది రోజుల క్రితం గాలివానకు రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జేబీకే పురంలో త్రీఫేజ్ విద్యుత్ లేక మూడు రోజులుగా గ్రామస్తులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పల్లెల్లో విద్యుత్ సమస్య ఏర్పడితే కనీసం ఒకరోజు ఇబ్బందిపడే పరిస్థితులు ఉన్నాయి. బేస్తవారిపేట మండలంలోని గలిజేరుగుళ్లలో గత రెండు రోజులుగా రాత్రి వేళల్లో విద్యుత్ నిలిచిపోతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

దుకాణదారులకు ఇక్కట్లు

విద్యుత్ కోతలతో ఇంటర్నెట్, జిరాక్స్ షాపులు, దుకాణదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం మండల కేంద్రాలకు వచ్చిన ప్రజలు విద్యుత్ లేక గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేది. ఈదురుగాలులు, భారీ వర్షాలు పడినప్పుడు కూడా అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేవారు. ప్రస్తుతం పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటం, వర్షాలు కురిసిన సమయంలో కోతలు మరీ ఎక్కువగా ఉండటంతో జనం విసుగు చెందుతున్నారు.

కోతలు సరికాదు



ఇటీవల కాలంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. ఎడాపెడా విద్యుత్ నిలిచిపోతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కరెంట్ కోతలు విధించడం సరికాదు. విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆవుల శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

ఉక్కపోతతో అల్లాడుతున్నాం



గత రెండు రోజుల క్రితం రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఒకవైపు దోమల బెడద, మరోవైపు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నాం. చిన్నపిల్లలు ఉండే ఇళ్లలో వారి బాధలు వర్ణనాతీతం. కోతలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నాం.

– లక్కమనేని రాము, చెన్నుపల్లె

వైఎస్సార్ సీపీని

క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దాం


కార్యకర్తలతో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని చెప్పారు. జగనన్న పాదిలిలో తల పెట్టిన పోరుబాట కార్యక్రమం వాతావరణం అనుకూలించకపోవడం వల్ల వాయిదా పడిందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి కలిసి మెలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన రాచర్ల మండలానికి చెందిన బద్దీటి ప్రవీణ్‌కుమార్ మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మానం బాలిరెడ్డి, ఓబులరావు, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, దేవదానం, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, సీఆర్‌ఐ మురళి, పగడాల శ్రీరంగం, క్రిష్టారెడ్డి, గర్రె సత్యనారాయణ, ఎదురు శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల సమస్య కొలిక్కి..


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, విద్యుత్‌శాఖ ఏఈలు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడులో కర్నాటి చిన్న వెంకట సుబ్బారెడ్డి డీప్ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను మరో రైతు పీకేశాడు. దీనిపై 'కక్షతో విద్యుత్ స్తంభాలు పెకలింపు' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 26న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ జితేంద్రకుమార్, విద్యుత్ శాఖ ఏఈ సన్యాసిరావు, సర్వేయర్ నాగేశ్వరరెడ్డి సంఘటన జరిగిన పొలం వద్దకు వెళ్లి సంబంధిత రైతులతో మాట్లాడారు. స్తంభాలు పెకలించిన రైతు పొలం కిందవైపు నుంచి మరో స్తంభం అదనంగా ఏర్పాటు చేసేలా ఒప్పించారు. కార్యక్రమంలో వీఆర్వో సయ్యద్ హషం, విద్యుత్ లైన్‌మెన్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే కేపీ పరామర్శ


స్వామిరంగారెడ్డిని పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు సూరా స్వామిరంగారెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం గిద్దలూరులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం ఆయనను గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మానం బాలిరెడ్డి, ఓబులరావు, కృష్ణారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగానికి ఘన నివాళి


వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గిద్దలూరు రూరల్: కందుకూరు వీరేశలింగం పంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాది డి.సిద్దయ్య మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టేందుకు ఎంతగానో శ్రమించిన గొప్ప వ్యక్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి వీరేశలింగం పంతులు అని కొనియాడారు. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం బి.రామిరెడ్డి, పారా వలంటీర్ మధు, యువ ప్రగతి పథం సంస్థ అధ్యక్షుడు డి.ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురంలో యోగాలో పాల్గొన్న కమిషనర్, సీఐ తదితరులు


కంభంలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


రాచర్లలో..

బేస్తవారిపేట: యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగా చేయాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్రకుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యోగాపై శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇన్‌స్ట్రక్టర్లు జెడ్పీ హైస్కూల్ పీడీ మధుసూదనాచార్యులు, బి.వందన, సి.లక్ష్మీనారాయణ యోగాపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసనాయక్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, సచివాలయ ఉద్యోగులు, టీఏలు పాల్గొన్నారు.

రాచర్ల: యోగాను నిత్య జీవనంలో ఒక భాగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల అధికారులు యోగాసనాలు చేశారు. ఎస్సై పి.కోటేశ్వరరావు, యూఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు అనిల్‌కుమార్, శివరామకృష్ణ, సురేష్, వెంకటేశ్వరనాయక్, వీపీఏ రమణ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రమణారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సతీష్‌బాబు, యోగా శిక్షకురాలు దుర్గమ్మ, ఈఓఆర్డీ చెన్నారావు, పర్యవేక్షకులు డి.విజయ, ఏపీఎం రమణి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో యోగా శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. యోగా సాధనతో మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఈఓపీఆర్డీ శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంభం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరభద్రాచారి మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని పేర్కొన్నారు. యోగా శిక్షణకు హాజరయ్యేవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొమరోలు: ఒత్తిడిని తగ్గించుకుని ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగాసనాలు వేయడం ఉత్తమ మార్గమని ఎంపీడీఓ మస్తాన్‌వలి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అధికారులు, సిబ్బంది, ప్రజలకు యోగా సాధనపై అవగాహన కల్పించారు. ఎంపీపీ కామూరి అమూల్య, యోగా గురువు పొట్టిసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకూ సచివాలయ స్థాయిలో సిబ్బందికి యోగ మాస్టర్ ట్రైనర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, మున్సిపల్ ఏఈ భూపాల్‌రెడ్డి, జెడ్పీ పాఠశాల సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


గిద్దలూరులో యోగాసనాలు వేస్తున్న అధికారులు


బేస్తవారిపేటలో యోగాసనాలు వేస్తున్న మండల అధికారులు


కొనకనమిట్లలో..


కొమరోలులో..

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని మండలంలోని డీలర్లకు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా పకడ్బందీగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు అందజేయాలని చెప్పారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాంనారాయణరెడ్డి, ఆర్ఐ భాస్కర్‌రావు, డీలర్లు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఎస్సై

రాచర్ల: వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఏఎస్సై వై.ఆదిశేషయ్య సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని చెప్పారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రామకోటయ్య

రాచర్ల: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య సూచించారు. రాచర్ల పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై పి.కోటేశ్వరరావు, ఏఎస్సై వై.ఆదిశేషయ్య, రైటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.